## క్లుప్తంగా

### రేపటి నుంచి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: మండలంలోని బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించి రుణాలకు ఆయా లబ్ధిదారులు ఈనెల 30 నుంచి ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్లో దరఖాస్తులు దాఖలు చేసుకోవాలని సంతనూతలపాడు ఎంపీడీవో సురేష్ బాబు మంగళవారం నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. లబ్ధిదారులు ఆయా ఆన్‌లైన్ పోర్టల్లో సబ్సిడీతో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు నమోదు చేసుకోవాలని, అర్హత కలిగిన లబ్ధిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

### పేరిరెడ్డికి చుండూరు నివాళి



నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: నగరంలోని 10వ డివిజన్ అగ్రహారానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వాకా పేరిరెడ్డి మృతి చెందారు. పేరిరెడ్డి భౌతికకాయాన్ని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మంగళవారం సందర్శించి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. అనంతరం మృతుడు పేరిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మ సురేష్, యువత అధ్యక్షుడు దేవా, బీసీ నాయకులు కుట్టుబోయిన కోటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మచ్చే కదా అని వదిలేస్తే.. ముప్పే

మీ శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడలున్నాయా.. మచ్చలే కదా అని తేలిగ్గా తీసిపారేయొద్దు.. ఎందుకంటే ఆ మచ్చలతోనే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. శరీరంపై ఎక్కడ మచ్చలున్నా మొహమాటపడకుండా వైద్య సిబ్బందికి చూపించాలి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కింద చేపట్టిన కార్యక్రమంలో వైద్యులకు తెలియజేయాలని చెబుతున్నారు.

- ఇంటింటా కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే
- మచ్చలుంటే చూపించాలంటున్న వైద్యులు
- నియోజకవర్గంలో 70కిపైగా బయటపడిన అనుమానితులు



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సంతనూతలపాడు: కుష్టు వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సిబ్బందిని పంపి వ్యాధి నిర్ధారణ సర్వే చేపట్టింది. అనుమానిత మచ్చలు, పొడలు శరీరంపై ఉంటే నిర్భయంగా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఆయా హెల్త్ సెంటర్లు, అర్బన్ సెంటర్ల పరిధిలో ఇంటింటి సర్వేలో భాగంగా దాదాపు 2,19,000 మందిని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పరిశీలించనున్నారు. 20వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమైన ఈ కుష్టు నిర్ధారణ సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగుతుంది. ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద వలంటీర్లు సర్వే చేసేందుకు ఇంటింటికీ వెళ్తున్నారు. అవసరమైతే వైద్యాధికారులు సర్వేలో పాల్గొంటారు.



ఓ వ్యక్తి వీపుపై మచ్చలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

**వివరాలన్నీ ఆరా తీస్తూ...**

శరీరంపై మచ్చలు, అధిక మోతాదులో పొడలు ఉంటే సిబ్బంది వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. వైద్యాధికారులు అనుమానిత లక్షణాలున్న వ్యక్తిని పరిశీలించి కుష్టు వ్యాధి అవునో.. కాదో నిర్ధారణ చేస్తారు. ఒక వేళ కుష్టుగా తేలితే సంబంధిత వ్యక్తి పేరును రిజిస్టర్ చేసుకొని చికిత్స ప్రారంభిస్తారు. కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియా లెప్రే వల్ల వస్తుంది. ఈ వ్యాధి రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ప్రతి నాలుగు నెలలకోసారి ఇంటింటి సర్వే చేయడంతోపాటు త్వరితగతిన వ్యాధిగ్రస్తులను కనుగొని చికిత్స ఇవ్వడం ద్వారా అంగ వైకల్యం రాకుండా కాపాడవచ్చు. వ్యాధి కారక బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన ఆరు నెలల నుంచి 5 ఏళ్ల లోపల వ్యాధి లక్షణాలు బయట పడతాయని వైద్యాధికారులు తెలిపారు. సర్వే చేపట్టిన రెండు రోజుల్లో నియోజకవర్గంలో 70కిపైగా కుష్టు అనుమానిత కేసులను గుర్తించారని సమాచారం.

**కుష్టువ్యాధి లక్షణాలు ఇవే..**

- ముఖంపై చర్మం నూనె రాసినట్టు నిగనిగలాడుతుంది
- కాళ్లు, చేతులపై స్పర్శ జ్ఞానం లోపించడం
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం
- కాళ్లు చేతులు తిమ్మిర్లు, అరికాళ్లు, చేతులకు స్పర్శ లోపించడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారి పోవడం, వేళ్లు వంకర్లు తిరగడం
- చర్మంపై పాలిపోయిన రాగివర్ణంతో కూడిన స్పర్శలేని మచ్చలుండడం
- కుష్టు వ్యాధి సంబంధిత మచ్చలపై చెమట పట్టకపోవడం
- కనుబొమ్మలు లేదా వెంట్రుకలు రాలిపోవడం

**ఎండీటీ మందులతో వ్యాధి నయం అవుతుంది**

బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) ద్వారా కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుంది. ప్రారంభ దశలో గుర్తించి సక్రమంగా చికిత్స చేయించుకుంటే వ్యాధితోపాటు అంగ వైకల్యం రాకుండా నివారించవచ్చు. ఆరు నెలల నుంచి 12 నెలల పాటు ఎండీటీ మందులతో చికిత్స తీసుకుంటే కుష్టు పూర్తిగా నయమవుతుంది.

**కుష్టును పారదోలుదాం**

ఒకప్పుడు కుష్టు పేరు వింటేనే భయపడేవారు. కానీ ఇప్పుడు అలా కాదు. ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో కుష్టు వ్యాధిని నివారించగలిగాం. అక్కడక్కడా కేసులు బయటపడుతున్నా ఎండీటీ మందులతో వ్యాధి పూర్తిగా నిర్మూలించగలుతున్నాం.

– డాక్టర్ వరుణ తేజ, యూపీహెచ్‌సీ, పీర్లమాన్యం

**సిబ్బందికి సహకరించాలి**



ఇంటింటి సర్వే చేయడానికి వస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి ప్రజలు సహకరించాలి. శరీరంపై ఎలాంటి మచ్చలున్నా మొహమాటం లేకుండా సిబ్బందికి చెప్పాలి. కుష్టు వ్యాధి నిర్ధారణ జరిగినా భయపడాల్సిన పని లేదు. ఎండీటీ మందు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుంది.

– రాచెటి ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, సంతనూతలపాడు మండలం

### ఉత్తమ ఎంపీడీవోకు జెడ్పీటీసీ అభినందనలు



ఎంపీడీవో సురేష్‌బాబును సత్కరిస్తున్న జెడ్పీటీసీ దుంపా రమణమ్మ

సంతనూతలపాడు: మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా స్థాయి ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న డీ సురేష్ బాబును మంగళవారం జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ మోహన్ రావు దంపతులు మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి వెంట కో ఆప్షన్ సభ్యులు షేక్ రంతుల్లా, షేక్ షరీఫ్ ఉన్నారు.

### గీత కల్లు కార్మికులకు 2 మద్యం దుకాణాలు

- వచ్చే నెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ



సుకన్య, ఎక్సైజ్ సీఐ, చీమకుర్తి

చీమకుర్తి: చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మూడు మండలాలకు సంబంధించి కల్లు గీత కార్మికులకు 2 మద్యం దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సుకన్య తెలిపారు. మంగళవారం చీమకుర్తిలోని ఎక్సైజ్ స్టేషన్‌లో మీడియాతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సర్కిల్ పరిధిలో ఉన్న ప్రస్తుత దుకాణాలపై 10 శాతం చొప్పున రెండు దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. సంతనూతలపాడు మండల పరిధిలోని దుకాణాన్ని గౌడ కులస్తులకు, మద్దిపాడు మండల పరిధిలోని దుకాణాన్ని గమళ్ల కులస్తులకు కేటాయించారన్నారు. ఆసక్తి కలిగిన ఆయా సామాజిక వర్గాల వారు వచ్చేనెల 5వ తేదీ లోపు ఆఫ్‌లైన్ లేక ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

### నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని రామ్‌నగర్‌లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు నగర్ విద్యుత్ శాఖ డీఈఈ కేవీ పాండురంగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామ్‌నగర్‌లోని డి-2 విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని మరమ్మతుల కారణంగా 7వ లైన్ నుంచి 12వ లైన్ వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అందుకు డి-2 ఏఈ దాసరి వెంకటేశ్వర్లుకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**పేర్నమిట్ట పరిసర ప్రాంతాల్లో కూడా..**

ఒంగోలు నగర విద్యుత్ సబ్ స్టేషన్ డి-3 పరిధిలోని పేర్నమిట్ట పరిసర ప్రాంతాల్లో కూడా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పాండురంగారావు పేర్కొన్నారు. డీ-3 ఏఈ ఎస్.శివ ప్రసాద్‌కు కూడా ఆదేశాలు జారీ చేశామని, పేర్నమిట్టతో పాటు అంబేడ్కర్ నగర్, ఎండ్లూరు డొంక ఏరియా, ప్రతిభ కాలేజీ ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్, టుబాకో వేలం కేంద్రం ఏరియా, ద్వారకానగర్ ప్రాంతాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.



ఆందోళనకు దిగిన చిరు వ్యాపారులు



అధికారులను నిలదీస్తున్న వ్యాపారి

# నాడు లంచాలు తీసుకుని.. నేడు కూలదోసి!

- కార్పొరేషన్ అధికారులపై బాధితుల మండిపాటు



ప్రశ్నిస్తున్న మహిళ



ఇదేం న్యాయమంటూ ధ్వజమెత్తుతున్న యువకులు

ఒంగోలు సబర్బన్: కూరగాయలను దుకాణాల బయటపెట్టుకొని అమ్ముకునేందుకు ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఒక్కో షాపు నుంచి రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకున్నారంటూ కూరగాయల వ్యాపారులు అధికారులను నిలదీశారు. కనీసం రసీదులు కూడా ఇవ్వకుండా వసూలు చేసి రాజకీయ నాయకులు చెప్పారంటూ దుకాణాలను కూలదోస్తారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి దుకాణదారులను వేధింపులకు గురిచేస్తుందంటూ మండిపడ్డారు. కూరగాయల దుకాణాల బాధితుల ఉసురు పోసుకుంటారంటూ శాపనార్థాలు పెట్టారు. గతంలో గాంధీ రోడ్డులో ఒక వ్యాపారిని వేధించినందుకు ఆ వ్యాపారి పురుగుమందు తాగి మృతి చెందాడని, అందుకు కారణం రెవెన్యూ ఇన్‌స్పెక్టరేనని ధ్వజమెత్తారు. అధికార పార్టీ నాయకుల సామాజిక వర్గానికే చెందిన కళ్యాణి వేధింపులు తాళ లేకపోతున్నామని వాపోయారు. కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వీరాంజనేయులు తమను వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ధ్వజమెత్తారు. పదవీ విరమణ చేసిన తర్వాత అడ్డగోలుగా నిబంధనలకు వ్యతిరేకంగా మళ్లీ ఉద్యోగంలో చేరి మార్కెట్‌లోని వ్యాపారులపై కక్ష తీర్చుకుంటున్నాడని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తిరిగి ఉద్యోగంలో చేరి వేధించటం సరైన పద్ధతి కాదంటూ విమర్శిస్తున్నారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారులు, అధికార పార్టీ నాయకులు కావడంతో వేధింపులు అధికం చేశారంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

### ఐటీసీ గ్రామసిరి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

ఒంగోలు సిటీ: ఒంగోలు మండలం పరిధిలోని ఉలిచిలో ఐటీసీ సహకారంతో గ్రామసిరి క్లైమేట్ స్మార్ట్ విలేజ్ అనే ప్రోగ్రాంలో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామంలో రైతులు పండిస్తున్న వరి, మినుము, శనగ పంటలపై ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బసవయ్య ఆధ్వర్యంలో రిసోర్సు పర్సన్ రాధా సింగమనేని రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రిసోర్సు పర్సన్ రాధా సింగమనేని మాట్లాడుతూ ప్రధాన పంటలతో పాటు అంతర్ పంటలు, పలు పంటల మీద అవగాహన కల్పించారు. అంతేకాకుండా రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఐటీసీ సహకారంతో గ్రామసిరి క్లైమేట్ స్మార్ట్ విలేజ్ గ్రామాల్లో రైతులకు అందిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బసవయ్య వివరించారు. గ్రామసిరి సిబ్బంది వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

### మంచానికి పరిమితమైన పెన్షనర్ల పరిశీలన



పెన్షన్ పొందుతున్న వృద్ధుడిని పరిశీలిస్తున్న డాక్టర్లు

మద్దిపాడు: మండలంలో మంచానికి పరిమితమై మెడికల్ గ్రాండ్స్ లో పెన్షన్ తీసుకుంటున్న 23 మందిని డాక్టర్లు మంగళవారం ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించారు. డాక్టర్ హర్ష, డాక్టర్ విజయ్ చంద్ర, పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద మోహన్ లు మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఐదుగురిని, బసవన్నపాలెంలో ఒకరు, పెద్దకొత్తపల్లి, నేలటూరుల్లో ఐదుగురు, దొడ్డవరంలో ఇద్దరు, మల్లవరంలో ఒకరు, కొలచనకోటలో ముగ్గురు, అన్నంగిలో ఇద్దరు, గుండ్లపల్లి లో ఒకరు, ఘడియపూడిలో ఒకరు, నాగన్నపాలెం గ్రామంలో ఒకరు ఉండగా వీరిని పరిశీలించి నివేదికను కలెక్టర్ కు అందజేయనున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట ఎంపీడీవో వీ జ్యోతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# మిరప పంటల్లో సస్యరక్షణ

చీమకుర్తి రూరల్: మండలంలోని బూదవాడ, పులికొండ గ్రామ సచివాలయాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ నిర్వహించారు. ప్రతి రైతు ఈపంటలో నమోదు చేసుకొంటే కలిగే ప్రయోజనాలు, పొగాకు, కంది, మిరప పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి డి.సంధ్య మాట్లాడుతూ మిరప వర్షాల కారణంగా మిరప తోటల్లో తామర పురుగు తెల్ల దోమ అధికంగా గమనించారు. రైతులు రెండు రకాల పురుగు మందులను కలిపి కొట్టడం వలన ఎక్కువ శాతంలో నష్టం కనబడుతోందన్నారు. రైతులు కచ్చితంగా సూక్ష్మ పోషకాల మిశ్రాన్ని పది రోజులకు ఒకసారి అందించాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



కలెక్టర్, ఎస్పీ నుంచి ప్రశంసపత్రాలు అందుకుంటున్న కొత్తపట్నం మెరైన్ ఎస్సై సుబ్బారావు, మెరైన్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, హోంగార్డు పోతురాజు

### ఉత్తమ సేవలకు అందిన ప్రశంస పత్రాలు

ఒంగోలు సిటీ: కొత్తపట్నం బీచ్‌లో పబ్లిక్ ప్రాణాలు కాపాడి ఉత్తమ సేవలు అందించిన ముగ్గురు మెరైన్ పోలీసులకు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా కొత్తపట్నం ఎస్సై పి.సుబ్బారావు, కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వర్లు, హోంగార్డు వి.పోతురాజులకు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రశంసపత్రాలు పొందిన మెరైన్ పోలీసులను సహచర ఉద్యోగులు అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
చీమకుర్తి 84639 03727
Office mail : sakshiongads@gmail.com

# వ్యాధుల నివారణకు పశువైద్య శిబిరం



మైనంపాడులో పశువైద్యం చేస్తున్న వెటర్నరీ వైద్యులు



ఇలపావులూరు పశువైద్య శిబిరంలో గొర్రెలకు వైద్యం చేస్తున్న డాక్టర్ మనురూప్

సంతనూతలపాడు: గేదెలు, గొర్రెలు, మేకలకు సీజన్లో వచ్చే వ్యాధుల నివారణకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పాక చిరంజీవి తెలిపారు. మండలంలోని మైనంపాడులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాకల చిరంజీవి 4500 గొర్రెలు, మేకలు 45 గేదెలు, 38 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి పశు పోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ గుండవరపు సుబ్బారావు, గొర్రె కాపరుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిలారి పెద్దబ్బాయి, పశు వైద్య సహాయకులు వీ ప్రసన్న లక్ష్మి, కే శైలజ, రైతులు పాల్గొన్నారు.

**ఇలపావులూరులో పశువైద్య శిబిరం**

చీమకుర్తి రూరల్: మండలంలోని ఇలపావులూరు గ్రామంలో పల్లామల్లి పశువైద్యాధికారి డాక్టర్ టీ మనురూప్ మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. మంగవారం 2200 గొర్రెలు, మేకలకు, 13 దూడలకు, 60 ఆవులకు నట్టల నివారణకు వైద్యం చేశారు. 2 పశువులకు ఎదకు సంబంధించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇలపావులూరు సచివాలయ పశుసంవర్ధక అసిస్టెంట్స్ కే నరేంద్ర, పలు గ్రామాల సచివాలయ పశుసంవర్ధక అసిస్టెంట్స్, పశువుల పెంపకందారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ.-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేదీ&సమయం: 14-02-2025, ఉ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ల వరకు
ధరావత్తు సమర్పించుటకు ఆఖరు తేదీ: ఇ-వేలం ప్రారంభానికి ముందు వరకు

[illegible] ... Coordinates of the Site-15.592707,79.773267.

రిజర్వు ధర: రూ.30,23,500/-, ధరావత్తు: రూ.3,03,000/-, బిడ్ పెంపుదల : రూ.30,300/-

[illegible] ... Coordinates of the Site-15.592707,79.773267.

రిజర్వు ధర: రూ.9,74,100/-, ధరావత్తు: రూ.97,500/-, బిడ్ పెంపుదల : రూ.9,750/-

[illegible] https://baanknet.com [illegible] www.unionbankofindia.co.in [illegible] Mail ID : arb.vijayawada@unionbankofindia.bank [illegible]

[illegible]

తేది : 24.01.2025
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్, విజయవాడ